15072024-MAI-10_Layout 1 7/15/2024 3:29 AM Page 1



# ఎస్‌సీఎస్‌ఎస్ అదుర్స్

## జూలై-సెప్టెంబర్ వడ్డీరేటు ఆకర్షణీయం



**రిటైర్మెంట్** తర్వాత ఆర్థిక భద్రతను కల్పించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చినదే సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్). దీని వడ్డీరేటును 3 నెలలకోసారి కేంద్రం సమీక్షించి ఓ నిర్ణయం తీసుకుంటుంది.

**ఎవరు పెట్టుబడి పెట్టవచ్చు?**

60 ఏండ్లు, ఆపై వయసు కలిగినవారు ఎస్‌సీఎస్‌ఎస్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. అలాగే స్వచ్ఛంధంగా లేదా స్పెషల్ వాలంటరీ స్కీంలో భాగంగా రిటైరైన 55 ఏండ్లకుపైబడినవారూ అర్హులే. సివిల్ డిఫెన్స్ సిబ్బంది మినహా రక్షణ సర్వీసుల నుంచి రిటైరైన ఉద్యోగులకూ ఈ పథకం వర్తిస్తుంది.

**ప్రస్తుత వడ్డీరేటు**

ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికిగాను డిపాజిట్లు చేసేవారికి 8.2 శాతం వడ్డీరేటు వస్తుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీ చెల్లింపులుంటాయి. ఏటా మార్చి 31, జూన్ 30, సెప్టెంబర్ 30, డిసెంబర్ 31 తేదీల్లో త్రైమాసికపు సెటిల్మెంట్లుంటాయి.

**డిపాజిట్ పరిమితి**

కనిష్ఠంగా 1,000, గరిష్ఠంగా రూ.30 లక్షలదాకా డిపాజిట్ చేసుకోవచ్చు. ఖాతాలో ఒకవేళ పరిమితికి మించి నగదు డిపాజిట్లు జరిగితే.. ఆ మొత్తాలను ఖాతాదారుకు వెంటనే రిఫండ్ చేయడం జరుగుతుంది. ఆలస్యమైతే డిపాజిట్ చేసిన దగ్గర్నుంచి రిఫండ్ ఇచ్చేదాకా పట్టిన సమయానికిగాను సదరు మొత్తాలకు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి ఇస్తారు.

**కాలవ్యవధి**

డిపాజిట్ కాలపరిమితి ఐదేండ్లు. ఆపై మరో మూడేండ్లు పొడిగించుకోవచ్చు. ఇలా ఎన్నేండ్లైనా పెంచుకుంటూపోవచ్చు. ప్రతీ పొడిగింపునకు ఓ దరఖాస్తును సమర్పించాలి. కాలపరిమితి ముగింపు దశలోనే ఇవ్వాలి.

**పన్ను లాభాలు**

ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు అందుతాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.50 వేలకు మించి వడ్డీ ఆదాయం వచ్చినప్పుడే పన్నులు వర్తిస్తాయి. నిబంధనలకు లోబడి ఫామ్ 15జీ/15హెచ్ సమర్పిస్తే టీడీఎస్ ఉండదు.

**ముందస్తు ఉపసంహరణలపై..**

కొత్త మార్గదర్శకాల ప్రకారం ఏడాదిలోగా ఎస్‌సీఎస్‌ఎస్ డిపాజిట్ ఖాతాను మూసేస్తే.. సదరు డిపాజిట్‌లో 1 శాతానికి సమానమైన మొత్తాలను ఇన్వెస్టర్లు కోల్పోవాల్సి వస్తుంది. అలాగే పూర్తి కాలపరిమితికన్నా ముందే చేసే ఉపసంహరణలపైనా పెనాల్టీలు వర్తిస్తాయని గుర్తుంచుకోవాలి.




## ఇలా ప్రయత్నిస్తే పన్ను ఆదా..

**ఆదాయ** పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలుకు సమయం ఆసన్నమైంది. దీంతో పన్ను ఆదా ఎలా? అన్న ప్రశ్న మళ్లీ అందరి మదిలో మెదులుతున్నది. అయితే ఇందుకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో.. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఎఫ్‌డీ, ఎల్‌ఐసీ పాలసీలు, ఈఎల్‌ఎస్‌ఎస్, ఎన్‌పీఎస్ తదితర పెన్షన్ ప్లాన్లలో పెట్టుబడులు కొన్ని. ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను మినహాయింపులను పొందవచ్చు. అలాగే ఉద్యోగులు వీలుంటే హెచ్‌ఆర్‌ఏతోపాటు టెలిఫోన్/ఇంటర్నెట్ ఖర్చుల రీయింబర్స్‌మెంట్, ఎడ్యుకేషన్ అలవెన్సులు, ఫుడ్ కూపన్స్‌ను ఎంచుకోవచ్చు. ఈపీఎఫ్ విరాళాలను పెంచుకోవడం కూడా కలిసొచ్చే అంశమే. ఇల్లు కొనే ఆలోచన ఉంటే.. గృహ రుణంపై పన్ను ప్రయోజనాలను అందుకోవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద లక్షన్నర రూపాయల వరకు లాభం పొందవచ్చు. వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యుల పేరిట తీసుకొనే ఆరోగ్య బీమాలకు చెల్లించే ప్రీమియంలపైనా రూ.50,000 వరకు పన్ను తగ్గింపులను కోరవచ్చు.




# ఆర్థిక ఫలితాలే దిక్సూచి

### మార్కెట్ పల్స్

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో గత వారం కూడా కొత్త రికార్డులు నమోదయ్యాయి. సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు లోనైనా.. ఓవరాల్‌గా లాభాలనే అందుకున్నాయి. ఆల్‌టైమ్ హైల్లోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడులకే మొగ్గు చూపారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు మునుపెన్నడూ లేని స్థాయిల్లోనే స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 522.74 పాయింట్లు ఎగిసి 80 వేలకు ఎగువన 80,519.34 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 178.30 పాయింట్లు ఎగబాకి 24,502.15 దగ్గర ముగిసింది. సెన్సెక్స్ 80,500 మార్కును, నిఫ్టీ 24,500 స్థాయిని దాటి ఆగడం ఇదే తొలిసారి. ఇక ఈ వారం మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్‌కు కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్నారు. దీంతో ఈ వారం మార్కెట్ సరళిని ఇవి అత్యంత ఎక్కువగా ప్రభావితం చేయవచ్చని అంటున్నారు. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

# ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీం

## మదుపరుల కోసం రిజర్వ్ బ్యాంక్ తెచ్చిన పథకం




**రిజర్వ్** బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2021 నవంబర్‌లో పరిచయం చేసిన పథకమే రిటైల్ డైరెక్ట్ స్కీం. నేరుగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టేందుకు వ్యక్తులు/రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఇదో వన్-స్టాప్ సొల్యూషన్‌గా వచ్చింది. అంతకుముందు ఈ పెట్టుబడి సౌకర్యం సంస్థాగత మదుపరులకే ఉండేది. అప్పట్లో మ్యూచువల్ ఫండ్స్ ద్వారానే ప్రభుత్వ బాండ్లను రిటైల్ ఇన్వెస్టర్లు కొనాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆర్బీఐ వెబ్‌సైట్‌పై అందుబాటులో ఉండే రిటైల్ డైరెక్ట్ స్కీం ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లను రిటైల్ ఇన్వెస్టర్లు కొనవచ్చు. పెట్టుబడుల కాల పరిమితుల ఆధారంగా రాబడులుంటాయి. అయితే ఈ స్కీం ద్వారా పొందే వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. ఈ స్కీం కోసం బ్యాంకులు లేదా ఆర్బీఐ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఏయే సెక్యూరిటీల్లో పెట్టుబడులు?**

ఈ పథకం కింద 4 రకాల ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టవచ్చు. అవి..

**ప్రభుత్వ సెక్యూరిటీలు (జీ-సెక్)**

తేదీతో కూడిన కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు ఫిక్స్‌డ్ లేదా ఫ్లోటింగ్ కూపన్ వడ్డీరేట్లను కలిగి ఉంటాయి. 6 నెలల ప్రాతిపదికన ముఖ విలువ ఆధారంగా చెల్లింపులు జరుగుతాయి.




సాధారణంగా వీటి కాలపరిమితి 5 ఏండ్ల నుంచి 40 ఏండ్లదాకా ఉంటుంది. ప్రారంభ పెట్టుబడి రూ.10,000.

**రాష్ట్ర అభివృద్ధి రుణాలు**

కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల మాదిరిగానే నిధుల అవసరం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్కెట్ నుంచి రుణాలను సమీకరిస్తుంది. వీటినే రాష్ట్ర అభివృద్ధి రుణాలుగా పిలుస్తారు. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.10,000. గరిష్ఠ కాలపరిమితి పదేండ్లు.

**ప్రభుత్వ ట్రెజరీ బిల్లులు**

ట్రెజరీ బిల్లులు లేదా టీ-బిల్స్ అనేవి.. మనీ మార్కెట్ సాధనాలు. కేంద్ర ప్రభుత్వం జారీచేసే స్వల్పకాలిక రుణ సాధనాలుగా కూడా పరిగణిస్తారు. ఇందులో కనీస పెట్టుబడి రూ.25,000. 91 రోజులు, 182 రోజులు, 364 రోజుల కాలపరిమితిని కలిగి ఉంటాయి.

**సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీ)**

గ్రాముల చొప్పున బంగారం లెక్కన ఉండేవే ఈ సావరిన్ గోల్డ్ బాండ్లు. వీటిని భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయ పెట్టుబడిగా చూడవచ్చు. నగదు రూపంలో ఇష్యూ ధరను ఇన్వెస్టర్లు చెల్లించాల్సి ఉంటుంది. మెచ్యూరిటీ సమయంలో తిరిగి నగదు రూపంలోనే అందుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం తరపున వీటిని ఆర్బీఐ జారీ చేస్తుంది. కనీస పెట్టుబడి 1 గ్రాము బంగారం. గరిష్ఠం 4 కిలోలు. పెట్టుబడి కాలపరిమితి 8 ఏండ్లు. అయితే ఐదేండ్ల తర్వాత ఎప్పుడైనా తీసుకోవచ్చు.

**ప్రయోజనాలు**

- ఖాతాను తెరిచేందుకు ఖర్చుండదు.
- పోర్ట్‌ఫోలియో వైవిధ్యం.
- క్రయవిక్రయాలకు అందుబాటులో ప్రైమరీ, సెకండరీ మార్కెట్లు.
- స్థిరమైన, ఆకర్షణీయమైన రాబడులు.
- వ్యక్తుల అవసరాలకు తగ్గట్టు రకరకాల మెచ్యూరిటీల్లో ప్రభుత్వ సెక్యూరిటీలు.
- క్రెడిట్ రిస్క్ ఉండదు.
- సురక్షిత పెట్టుబడులు.

### ఆర్డీజీ ఖాతాతో..

ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీం కింద, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టడానికి రిటైల్ డైరెక్ట్ గిల్ట్ (ఆర్డీజీ) అకౌంట్‌ను ఇండివీడ్యువల్ ఇన్వెస్టర్లు తెరవాల్సి ఉంటుంది. ఇది కూడా డీమ్యాట్ ఖాతా తరహాలోనే ఉంటుంది. భారత పౌరులతోపాటు ప్రవాస భారతీయులూ (ఎన్నారై) ఖాతాను తెరవవచ్చు. అయితే ఎన్నారైలు విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) నియంత్రణలో ఉంటారు. అలాగే ఎస్‌జీబీల్లో పెట్టుబడులు పెట్టలేరు. ఇక ఖాతాను తెరిచేందుకు అవసరమైన వాటిలో..

- ఆధార్‌తో లింకైన మొబైల్ నెంబర్.
- నెట్-బ్యాంకింగ్/యూపీఐ ఉన్న సేవింగ్స్ బ్యాంక్ రూపీ అకౌంట్.
- ఒరిజినల్ పాన్ కార్డు.
- ఖాతాదారుడి సంతకం స్కాన్ ఇమేజ్.
- ఈ-మెయిల్, కేవైసీ ధ్రువీకరణలు.

# విశ్వంభర స్వరాలవేట



ఒకప్పుడు సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ అంటే ఓ పండుగలా జరిగేది. సంగీత దర్శకుడు, గీత రచయిత, దర్శకుడు, నిర్మాత, గాయనీగాయకులు, హీరో.. ఇలా అందరూ కూర్చొని ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకుంటూ మంచి ఆల్బమ్ వచ్చే వరకూ కసరత్తులు చేసేవారు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. సంగీతం, సాహిత్యం అన్నీ ఫోన్లలోనే వినడం, ఫోన్లోనే ఓకే చేయడం. అయితే.. 'విశ్వంభర' టీమ్ ఈ పద్ధతికి పుల్‌స్టాప్ పెట్టి, పాత విధానానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరులోని కీరవాణి ఫామ్‌హౌస్‌లో చిరంజీవి, కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, గీత రచయిత చంద్రబోస్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అంతా కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చుని అద్భుతమైన ఆల్బమ్‌ని రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. షూటింగ్‌కి బ్రేక్ రావడంతో ఈ సమయాన్ని మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం వాడుకుంటున్నారు మూవీ టీమ్. వారంరోజుల పాటు వీరంతా అక్కడే ఉండి 'విశ్వంభర' పాటల పనిపట్టి తిరిగొస్తారట. చిరంజీవి నటించిన ఘరానామొగుడు, ఆపద్బాంధవుడు, ఎస్పీ పరశురామ్ చిత్రాలకు కీరవాణి స్వరాలందించారు. మ్యూజికల్‌గా మూడు సినిమాలూ ఆకట్టుకున్నాయి. 'విశ్వంభర' నాలుగో సినిమా. ఎలాగైనా మంచి పాటలు ఇవ్వడానికి కీరవాణి మనసుపెట్టి పనిచేస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 10న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

## మా ఊరి జాతరలో..



ఉద్వేగపూరితమైన పాత్రలో అల్లరి నరేశ్ నటిస్తున్న చిత్రం 'బచ్చలమల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో, హాస్య మూవీస్ పతాకంపై రాజేశ్ దండ, బాలాజీ గుత్తా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా మ్యూజికల్ ప్రమోషన్‌ని మేకర్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 16న ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను విడుదల చేయనున్నారు. విశాల్ భరద్వాజ్ ఈ పాటను స్వరపరిచారు. మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో ఇందులో అల్లరి నరేశ్ కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేశ్, అచ్యుత్‌కుమార్, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, వైవా హర్ష ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.

## ముఖ్యపాత్రల్లో మెరవనున్నారు



సిద్ధార్థ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా రూపొందనుంది. ఇది సిద్ధార్థ్ 40వ సినిమా కావడం విశేషం. శ్రీగణేశ్ దర్శకుడు. అరుణ్‌విశ్వ నిర్మాత. ఈ సినిమాలో సీనియర్ స్టార్స్ శరత్‌కుమార్, దేవయాని కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. హైబడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియనున్నాయి.

## అందుకే ఒళ్లు దగ్గరపెట్టుకొని చేస్తున్నా



అంబానీ ఇంట పెళ్లివేడుకలో బంగారంలా మెరిసిపోయింది జాన్వీకపూర్. అక్కడ అందరి దృష్టీ ఈ అందాలభామ పైనే. బంగారు రంగు డ్రెస్‌లో జాన్వీని చూసిన వారంతా కళ్లు తిప్పుకోలేకపోయారట. ఇదిలావుంటే.. ఇటీవల ముంబాయ్‌లోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న జాన్వీ.. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. ''దేవర-1' టాలీవుడ్‌లో నా తొలి సినిమా. అమ్మమ్మ తెలుగు. అమ్మ ఎక్కువ సినిమాలు చేసింది కూడా తెలుగులోనే. అందుకే.. కొత్తగా ఏం అనిపించలేదు. అప్పుడప్పుడు అమ్మ చుట్టాలతో తెలుగులో మాట్లాడుతుంటే చూసేదాన్ని. అందుకే తెలుగులో డైలాగులు చెప్పడం కష్టం అనిపించలేదు. సెట్‌లో అందరూ నన్ను ప్రత్యేకంగా చూడటం.. వయసులో చిన్నదాన్ని అయినా గౌరవించడం.. ఇవన్నీ మొదట్లో కాస్త ఇబ్బంది అనిపించింది. తర్వాత అర్థమైంది.. అదంతా అమ్మ ప్రభావం అని. తెలుగువాళ్లు అమ్మను ఎంత గౌరవిస్తారో, ఎంత ఆరాధిస్తారో సెట్‌లో నాకిస్తున్న గౌరవం చెప్పకనే చెబుతోంది. తెలుగులో తారక్ నా తొలి హీరో కావడం నిజంగా ఆనందంగా ఉంది. తను గొప్ప నటుడు. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకొని చేస్తున్నా. రామ్‌చరణ్ సినిమా ఇంకా మొదలవ్వలేదు. తనతో నటించేరోజు కోసం ఎదురుచూస్తున్నా. టాలీవుడ్‌లో మంచి అవకాశాలొస్తే వదులుకోను. ఎందుకంటే అది నా మదర్ ఇండస్ట్రీ.' అని ఆనందం వెలిబుచ్చింది జాన్వీ కపూర్.

### చిత్రం

## కొత్త సినిమాకు క్రేజీ టైటిల్?



*'కల్కి 2898ఏడీ'*తో వెయ్యికోట్ల మైలు రాయిని దాటేసి, రికార్డుల్ని వేటాడే పనిలో ఉన్నారు ప్రభాస్. వసూళ్ల పరంగా ఇంకా 'కల్కి' స్పీడులోనే ఉంది. మరి ఈ వేటకు ఫుల్‌స్టాప్ ఎక్కడ పడుతుందో తెలియాలి. ఇదిలావుంటే.. ప్రభాస్ తాజా సినిమాకు సంబంధించిన క్రేజ్ అప్‌డేట్ ఒకటి ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. 'సీతారామం'ఫేం అను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ చిత్రం చేయనున్న విషయం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటునట్టు తెలుస్తున్నది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. అందుకే ఈ టైటిల్ బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో దర్శకుడు అను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. ఇందులో కథానాయికగా మృణాళ్‌ఠాకూర్ ఖరారైనట్టు వార్తలు వస్తున్నాయి. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు.

## నెక్ట్స ఎవరితో?




'గుంటూరుకారం' తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేసేదీ క్లారిటీ రాలేదు. 'గుంటూరుకారం' నిర్మాణంలో ఉన్నప్పుడు నెక్ట్స సినిమా బన్నీతో అని వార్తలొచ్చాయి. అయితే షూటింగ్ పూర్తవ్వకపోవడంతో 'పుష్ప2' డిసెంబర్ 6కు వాయిదా పడింది. దాంతో త్రివిక్రమ్ కథ మళ్లీ మొదటికొచ్చింది. అంతేకాకుండా 'పుష్ప'తో అల్లు అర్జున్ ఇమేజ్ పాన్‌ఇండియా స్థాయికి చేరుకుంది. దాంతో త్రివిక్రమ్‌ని కూడా ఆ స్థాయి కథనే సిద్ధం చేయమని అల్లు కాంపౌండ్ చెప్పిందట. దానికి గురూజీ కొంత టైమ్ అడిగినట్టు ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం ప్రథమశ్రేణి హీరోలంతా పాన్ ఇండియా స్థాయిలో ఆలోచిస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు త్రివిక్రమ్ ఆ స్థాయి కథనే సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి. ఇదిలావుంటే.. రామ్ పోతినేనితో ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకుంటున్నారు త్రివిక్రమ్. ఎందుకంటే నిర్మాత స్రవంతి రవికిశోర్ తీసిన సినిమాలే త్రివిక్రమ్‌ని స్టార్‌ని చేశాయి. దర్శకుడిగా ఆయన తొలి సినిమా కూడా స్రవంతి మూవీసే కావడం గమనార్హం. ఆ రుణం తీర్చుకునేందుకే రవికిశోర్ తమ్ముడి తనయుడైన రామ్ పోతినేని హీరోగా ఓ సినిమా చేయాలనుకుంటున్నారట త్రివిక్రమ్. బయట టాక్ అయితే ఇలావుంది. మరి త్రివిక్రమ్ అంతరంగం ఎలావుందో.

## టాలీవుడ్‌లో చేయడానికి రెడీ



ఇటీవలే 'సర్ఫిరా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు అక్షయ్‌కుమార్. సుధా కొంగర దర్శకత్వంలో తమిళ సినిమా 'సురారై పోట్రు' ఆధారంగా రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో ఆడుతున్నది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'తెలుగులో 'కన్నప్ప' సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం టాలీవుడ్ మేకర్స్ కొత్తగా ఆలోచిస్తున్నారు. అందుకే వారి సినిమాలు జాతీయ స్థాయిలో విజయాలను అందుకుంటున్నాయి. ఇప్పుడు ఏ భాషలో నటించినా దేశం మొత్తం చూస్తున్నారు. అందుకే తెలుగు మేకర్స్‌తో పనిచేయాలని ఉంది. 'కన్నప్ప' తర్వాత నేను చేయదగ్గ పాత్రలు తెలుగులో దొరికితే తప్పకుండా నటిస్తా.' అని చెప్పుకొచ్చారు అక్షయ్. ఇది టాలీవుడ్ దర్శకులకు, రచయితలకూ ఓ మంచి వార్తే అని చెప్పక తప్పదు. కథ నచ్చితే చిన్న సినిమా అయినా చేసేయడం అక్షయ్ స్టైల్. మిగతా హీరోలకు ఆయన పూర్తి భిన్నం. ఏడాదికి అయిదారు సినిమాలు ఇప్పటికీ చేసేస్తుంటారు. ఇప్పుడు తెలుగులో చేయడానికి రెడీ అన్నారు. ఆయన నిర్ణయం వల్ల తెలుగులో మరిన్ని మంచి కథలు తయారయ్యే అవకాశం లేకపోలేదు.

## 48గంటల్లో జరిగే ఫిక్షన్ డ్రామా



'అయిదుగురు స్నేహితుల్లో ఒకడు ఓ ఇన్సిడెంట్‌లో చనిపోతాడు. మిగతా నలుగురూ ఆ సిట్యువేషన్‌ను ఎలా హ్యాండిల్ చేశారు? పోలీసుల నుంచి ఎలా తప్పించుకున్నారు.? ఒకవేళ అరెస్ట్ అయితే ఎలా బయటపడ్డారు? అనే ఆసక్తికరమైన ప్రశ్నల సమాహారం ఈ సినిమా. నిజంగా జరిగిన సంఘటన ఆధారంగా తెరకెక్కిన సినిమా ఇది. నాక్కూడా ఈ తరహా కథలంటే ఇష్టం. వినగానే నచ్చేసింది. అందుకే ఒప్పుకున్నా' అని 'బిగ్‌బాస్' ఫేం రవికృష్ణ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన థ్రిల్లర్ మూవీ 'ది బర్త్‌డే బాయ్'. సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి విస్కీ దర్శకుడు. ఐ.భరత్ నిర్మాత. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం రవికృష్ణ విలేకరులతో ముచ్చటించారు. 'నా ఫైనల్ గోల్ సినిమాల్లో నటించడం. నాకు సినిమాలంటే పిచ్చి. అన్ని తరహా పాత్రలు చేసి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడం నా ఆశయం. అందుకే మంచి అవకాశాలకోసం ఎదురుచూశా. 'విరూపాక్ష' తర్వాత అవకాశాలు బాగా వస్తున్నాయి. ఇందులో ఐదుగురు స్నేహితుల్లో ఒకడి సోదరుడి పాత్ర నాది. ఫుల్‌లెంగ్త్ ఉంటుంది. ఒక ట్రూ ఎమోషన్, ట్రూ డ్రామా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. 48 గంటల్లో జరిగే ఈ కథలో ఫిక్షన్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుంది.' అని తెలిపారు రవికృష్ణ. వందకోట్ల 'విరూపాక్ష'లో కీలక పాత్ర పోషించడం తన అదృష్టమని, ఆ సినిమా టైమ్‌లోనే ఈ అవకాశం వచ్చిందని, 'విరూపాక్ష'లో మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించిన దర్శకుడు కార్తీక్‌వర్మ దండు, సుకుమార్, సాయిదుర్గతేజ్‌లకు కృతజ్ఞతలని రవికృష్ణ చెప్పారు.